హ్యాండ్ బ్యాగులో నుంచి బంగారం చోరీ

- 10 తులాల ఆభరణాలు అపహరణ
- లబోదిబోమంటున్న బాధితురాలు
- మానుకోట ఆర్టీసీ బస్టాండ్‌లో ఘటన



విచారణ చేస్తున్న టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి

6

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



మహబూబాబాద్
MAHABUBABAD
శుక్రవారం 7 నవంబరు 2025



వరంగల్ స్టేషన్ రోడ్డులో ఆర్‌ఎస్ బ్రదర్స్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న సినీ హీరోయిన్ శ్రీలీల

నగరంలో మెరిసిన శ్రీలీల

వరంగల్ స్టేషన్‌రోడ్డులో ఆర్‌ఎస్ బ్రదర్స్ షోరూమ్ ప్రారంభం

- మూడంతస్థుల్లోని వివిధ విభాగాల్లో సందడి
- 'ఐ లవ్‌యూ వరంగల్' అంటూ అభివాదం
- భారీగా తరలివచ్చిన అభిమానులు



అభిమానులకు అభివాదం చేస్తున్న దృశ్యం

గిర్మాజీపేట(వరంగల్) నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సినీ హీరోయిన్ శ్రీలీల గురువారం వరంగల్ నగరంలో సందడి చేశారు. వరంగల్ స్టేషన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన ప్రముఖ వ్యాపార సంస్థ ఆర్‌ఎస్ బ్రదర్స్ షోరూమ్‌ను గురువారం ప్రారంభించారు. ఆర్‌ఎస్ బ్రదర్స్ సంస్థ చైర్మన్ పొట్టి వెంకటేశ్వర్లు, మేనేజింగ్ డైరెక్టర్ సిర్ల రాజమౌళి, డైరెక్టర్ ప్రసాదరావు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీలీల జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం గ్రౌండ్ ఫ్లోర్‌లో వినూత్న డిజైన్‌ల కంచి, ధర్మవరం, ఆరణి, ఉప్పాడ, పోచంపల్లి చీరలను చూపుతూ సందడి చేశారు. మొదటి, రెండో అంతస్థుల్లోని కిడ్స్, పురుషులు, మహిళల డ్రెస్సింగ్ విభాగాలను సందర్శించారు. అనంతరం షోరూమ్ బయట ఏర్పాటు చేసిన స్టేజిపైకి చేరుకోగా, అప్పటికే అక్కడికి తరలివచ్చిన ఆశేష అభిమానులు కేరింతలు కొట్టారు. వారిని చూసిన శ్రీలీల 'ఐ లవ్ యూ వరంగల్' అనడంతో అభిమానులు కేకలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా శ్రీలీల మాట్లాడుతూ ఆర్‌ఎస్ బ్రదర్స్ 15వ షోరూమ్‌ను వరంగల్‌లో ఏర్పాటు చేశారని, ఇక్కడ అందరికీ అనువైన అందమైన దుస్తులు ఉన్నాయని తెలిపారు. 'అబ్బాయిలను ఆర్‌ఎస్ బ్రదర్స్ దుస్తుల్లో (మిగతా 7లో..)





- గంగారం మండలంలో ఆదరణకు నోచుకోని దేవాలయం
- పూనుగొండ్ల నుంచి మేడారం వరకు 40 కి.మీ. దట్టమైన అడవిమార్గం
- రూ.50 లక్షల కోసం పూజారుల వినతి

శీతకన్ను

మేడారం మాస్టర్‌ప్లాన్ సరే.. పగిడిద్దరాజు ఆలయ అభివృద్ధి ఏదీ?

మహబూబాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గంగారం మండలం పూనుగొండ్లలో ఉన్న సమ్మక్క పెనిమిటి (భర్త) పగిడిద్దరాజు ఆలయం అభివృద్ధిపై ప్రభుత్వం శీతకన్ను వేసింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో రెండేళ్లకోసారి జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరపై ఉన్న శ్రద్ధ పగిడిద్దరాజు దేవాలయంపై లేదు. దీనిని పాలకులు విస్మరించడం పట్ల భక్తులు అసంతృప్తికి గురవుతున్నారు. మేడారం జాతరను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి కోట్లాది రూపాయలతో మాస్టర్‌ప్లాన్ అమలు చేయడం స్వాగతించదగ్గ విషయమే! దీనికి అనుబంధంగా ఉన్న పగిడిద్దరాజు ఆలయం అభివృద్ధి గురించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు ఉన్నాయి.

ఉత్తరాయణ పుణ్యకాలంలో మాఘశుద్ధ పౌర్ణమినాడు మేడారంలో జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు సమ్మక్క భర్త అయిన పగిడిద్దరాజు గంగారం మండలం పూనుగొండ్ల నుంచి పెళ్లి కుమారుడిగా ముస్తాబై అడవిమార్గం గుండా దాదాపు 40 కిలోమీటర్లు ప్రయాణం చేసి, సమ్మక్క తల్లి గద్దెలపైకి వెళ్లి దర్శనమివ్వడం ఆనవాయితీ. 2026 జనవరి 28 నుంచి 31 వరకు జరిగే మేడారం వనదేవతల మహాజాతరను ఈ సారి అన్ని వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేసింది. దీనికి తోడు దేవస్థానం అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.101 కోట్లు మంజూరు ప్రకటించింది. అయితే ఈ జాతరకు ముందే మహబూబాబాద్ జిల్లాలో అనాదరణకు గురైన పూనుగొండ్ల పగిడిద్దరాజు ఆలయాన్ని పట్టించుకోకపోవడం విచారకరమని భక్తులు వాపోతున్నారు.

గంగారం నుంచి పూనుగొండ్లకు 24 కి.మీ..

గంగారం మండల కేంద్రానికి దాదాపు 24 కిలోమీటర్ల దూరంలో దట్టమైన కొండల నడుమ పూనుగొండ్లలో పెనక వంశానికి చెందిన పగిడిద్దరాజు స్వయంగా వెలిసి పూజలందుకుంటున్నారు. వాస్తవానికి మేడారం జాతరకు వెళ్లే భక్తులు తొలుత పూనుగొండ్లలోని పగిడిద్దరాజు ఆలయానికి వెళ్లి పూజలు చేసి, ఇక్కడే రాత్రి బస చేసిన అనంతరం మేడారంకు వెళ్లి అమ్మవారికి ఇష్టమైన నిలువెత్తు బంగారం సమర్పించుకుంటారు. మారుమూల పూనుగొండ్లలో ఉన్న పగిడిద్దరాజు ఆలయానికి సరైన రహదారి సౌకర్యాలు లేకపోవడంతో గత కొన్నేళ్ల నుంచి భక్తులు నేరుగా మేడారం వెళ్లి అక్కడే పగిడిద్దరాజును దర్శించుకుంటున్నారు. రెండేళ్లకొకసారి నిర్వహించే వనదేవతల జాతరకు కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నప్పటికి మేడారం అనుబంధ పగిడిద్దరాజు ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం విచారకరం.



ఆలయానికి పగుళ్లు.. చిన్న వర్షానికే తడుస్తున్న గోడలు

అధ్వానంగా రహదారులు..

పూనుగొండ్ల గ్రామంలోని పగిడిద్దరాజు ఆలయానికి వెళ్లాలంటే గంగారం నుంచి కాటినాగారం మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఇటు కొత్తగూడ మండలం నుంచి కర్లగండి మీదుగా పది కిలోమీటర్ల మేర అడవి మార్గంలో కామారం చేరుకుని అక్కడ నుంచి పూనుగొండ్లకు చేరుకోవాలి. అయితే ఈ రహదారులు అధ్వాన్నంగా ఉండడంతో వాటి మరమ్మతుల కోసం ప్రతీ జాతరకు ముందు ఎంతోకొంత నిధులు కేటాయిస్తున్నా.. తూ..తూ మంత్రంగానే పనులు జరుగుతున్నాయి. పూనుగొండ్ల నుంచి మేడారంకు దాదాపు 40 కిలోమీటర్ల ప్రయాణం ఉండగా ఇక్కడి భక్తులు దట్టమైన అడవి మార్గంలో సుమారు 24 కిలో మీటర్ల నడక దారిలో దుబ్బగూడెం చేరుకుని అక్కడ నుంచి లింగాల దారిలో

(మిగతా 8లో..)



అధ్వానంగాఉన్న మరుగుదొడ్లు

అడవి మార్గంలో వసతుల లేమి..

జాతర సందర్భంగా పగిడిద్దరాజును పెండ్లి కుమారుడిగా తయారు చేసి మేడారానికి 40కిలో మీటర్ల మేర దట్టమైన అడవి మార్గంలో అర్ధరాత్రి సుమారు వంద మంది వరకు బయలు దేరుతారు. ఈ మార్గం ప్రమాదకరమై ఉంటుంది. ఈ మార్గంలో పూజారులు నడిచివెళ్లేందుకు వీలుగా రహదారి ఏర్పాటు చేసి మార్గమధ్యలో మంచినీటి వసతి కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు. ఇక్కడి నుంచి వెళ్లిన భక్తులను మేడారం నుంచి అమ్మవారి తరుపున వచ్చే పూజారులుఎదుర్కొని ఎదుర్కోలు కార్యక్రమం, పూజలు చేసి స్వామివారిని ఆదివాసీసంప్రదాయాల నడుమ డప్పు, మేళతాళాలతో మృదంగా వాయిద్యాల నడుమ గద్దె పైకి వీసకు వెళతారు. మేడారం నుంచి సమ్మక్క తరుపు పూజురులు వచ్చే వరకు అడవి మార్గంలో వీరికి ఒక షెడ్డు నిర్మాణం చేయాలని గిరిజనుల కోరుతున్నారు.

ఆలయానికి నిధులు కేటాయించాలి

పెనక రాజేశ్వర్, పగిడిద్దరాజు ఆలయ ప్రధాన పూజారి, పూనుగొండ్ల



పూనుగొండ్ల గ్రామంలో నిక్షిప్తమై ఉన్న సమ్మక్క భర్త పగిడిద్దరాజు ఆలయం వర్షం వస్తే చాలు కురుస్తూ శిథిలావస్థకు చేరుకుంది. ఈ ఆలయం పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించాలి. దేవాదాయశాఖకు రూ.50 లక్షలు నిధులు కావాలని దరఖాస్తు పెడితే.. కాంట్రిబ్యూషన్ ఫండ్ కింద రూ.10 లక్షలు ఇస్తే రూ. 50 లక్షలు మంజూరు చేస్తామన్నారు. తమ వద్ద రూ.10 లక్షలు లేకపోవడంతో పంచాయతీరాజ్‌శాఖ, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్కను ఆశ్రయించాం. కానీ, అక్కడ్నుంచి కూడా ఎలాంటి స్పందన రాలేదు.

ఆరోగ్య కార్యక్రమాల్లో అగ్రభాగాన నిలపాలి

- డీఎంహెచ్‌వో రవిరాథోడ్

నెహ్రూసెంటర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జాతి ఆరోగ్య కార్యక్రమాల అమలులో జిల్లాను అగ్రభాగాన నిలపాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి భూక్య రవిరాథోడ్ అన్నారు. కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశమందిరంలో గురువారం వైద్యాధికారులు, నర్సింగ్, సూపర్‌వైజర్లు, వైద్యసిబ్బందితో మాతా శిశుసంరక్షణ, క్షయవ్యాధి నియంత్రణపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సిజేరియన్ కాన్పుల శాతం ఎక్కువగా ఉందని, సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలని చెప్పారు. గర్భిణులుగా ఉన్న సమయంలో యోగా నేర్పించాలని, మొదటి సారి గర్భం దాల్చిన వారికి ఇంటివద్ద పెద్దవారు సాధారణ ప్రసవం వల్ల కలిగే లాభాలను వివరించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధీర్‌రెడ్డి, ప్రోగ్రాం అధికారి సారంగం, వైద్యులు విజయ్‌కుమార్, శ్రావణ్‌కుమార్, ప్రత్యూష, ప్రసాద్, రాజు, గీత, పురుషోత్తం, శారద, రామకృష్ణ, స్వామి, నిలోహన, నీలిమ, శ్వేత, అశోక్ పాల్గొన్నారు.

రైతుబీమాలో కాసుల వేట

- డబ్బులు చెల్లించేందుకు ఏఈవో లంచం వేధింపులు
- విసిగి వేసారి ఏసీబీని ఆశ్రయించిన రైతు కుమారుడు
- రూ.10వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు
- మరిపెడలో కలకలం



ఏసీబీకి పట్టుపడ్డ నీలికుర్తి ఏఈవో సందీప్

మరిపెడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రైతు బీమా డబ్బులు చెల్లించేందుకు లంచం వేధింపులకు పాల్పడుతున్న మరిపెడ మండలం నీలికుర్తి ఏఈవో జీ.సందీప్‌ను రూ.10వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడలో గురువారం జరిగింది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం... మరిపెడ మండలంలోని ఆనెపురం రెవెన్యూ పరిధి స్టేజీతండా జీపీకి చెందిన గుగులోత్ బీక్కు గత నెల 14న మృతి చెందాడు. మృతుడికి వ్యవసాయం ఉండడంతో రైతు బీమా వరిస్తుంది. దీంతో బీమా క్లెయిమ్ కోసం మృతుడి కుమారుడు వసంత్ గత నెల 30న ఏఈవో సందీప్‌ను కలిసి అన్ని రకాల బీమా పత్రాలు అందచేశారు. రూ.20 వేలు ఇస్తేనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తానని ఏఈవో చెప్పాడు. దీంతో వసంత్ ఎంత బతిమాలాడినా ఏఈవో వినలేదు. రూ.10 వేలు ఇప్పుడు ఇస్తా, మరో రూ.10వేలు బీమా వచ్చాక ఇస్తానని ఏఈవోతో వసంత్ ఒప్పందం చేసుకొని అదే రోజున బీమాకు సంబంధించిన పత్రాలు ఏఈవోకు ఇచ్చాడు.

అయితే డబ్బులు ఇచ్చాకే పని మొదలు పెడతానని ఏఈవో చెప్పడంతో బాధితుడు హనుమకొండలోని ఏసీబీ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు గురువారం వసంత్ ఏఈవోకు ఫోన్ చేసి డబ్బులు పట్టుకొస్తున్నానని, ఎక్కడికి రావాలని అడగగా మరిపెడ బంగ్లాలోని జేజే రెస్టారెంట్ ఎదురుగా ఉన్న ఓ బేకరి దగ్గరకు రమ్మని చెప్పాడు. వసంత్ డబ్బులు పట్టుకొని అక్కడికి వెళ్లాడు. రూ.10వేలు ఏఈవో సందీప్‌కు ఇస్తుండగా ఏసీబీ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఏఈవో నివాసం ఉంటున్న ఇంట్లో, మరిపెడ వ్యవసాయ కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని ఏసీబీ వరంగల్ కోర్టుకు తీసుకెళ్లారు. ఈ దాడుల్లో డీఎస్పీ వెంట సీఐ ఎల్.రాజు, శేఖర్, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు. ఈ సంఘటన మండల కేంద్రంతో పాటు, వ్యవసాయ శాఖ ఉద్యోగ వర్గాల్లో కలకలం సృష్టించింది.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

- విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



కేజీబీవీలో విద్యార్థినుల విద్యాసామర్థ్యాలను తెలుసుకుంటున్న అద్వైత్‌కుమార్‌సింగ్

నర్సింహులపేట (మహబూబాబాద్‌క్రైం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ హెచ్చరించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధన సామర్థ్యాలను మెరుగు పరిచి, విద్యార్థులకు అర్థమయేలా బోధన చేయాలని అన్నారు. నర్సింహులపేట మండలకేంద్రంలో గురువారం ఆయన సుడిగాలి పర్యటన నిర్వహించారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం తనిఖీ చేసి, వారి విద్యాసామర్థ్యాలను పర్యవేక్షించారు. పరిసరాల పాఠశాల ఆవరణతో పాటు స్టోర్‌రూం, మరుగుదొడ్లను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎస్‌వోను ఆదేశించారు. అనంతరం వంతడుపల స్టేజీ మండల ప్రజాపరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌తో పాటు బయోమెట్రిక్‌ను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రానికి ప్రభుత్వం నుంచి సరఫరా అయే సరులకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు, గర్భిణులకు సకాలంలో పౌష్టికాహారం అందజేయాలన్నారు. అనంతరం మోడల్ పాఠశాల, వసతి గృహాన్ని సందర్శించి, తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ పరిశీలించారు. శానిటేషన్, వ్యక్తిగత పరిశుభ్రతపై కలెక్టర్ దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్‌బాబు, ఎంపీవో కిన్నెర యాకయ్య, గిర్దావరి అఖిల్, ఎస్‌వో స్వప్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

బిర్సాముండా జయంతిని ఘనంగా నిర్వహించాలి

- కేంద్ర గిరిజన సంక్షేమ మంత్రిత్వశాఖ అడిషనల్ సెక్రటరీ మహేష్‌ఠాకూర్



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, అధికారులు

మహబూబాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గిరిజన వీరుడు బిర్సాముండా జయంతిని ఘనంగా నిర్వహించాలని కేంద్ర గిరిజన సంక్షేమ మంత్రిత్వశాఖ అడిషనల్ సెక్రటరీ మహేష్‌ఠాకూర్ అన్నారు. న్యూఢిల్లీ శాస్త్రీభవన్ నుంచి అన్నిరాష్ట్రాల అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో అత్యంత ప్రాముఖ్యమైన గిరిజన నాయకుడు భగవాన్ బిర్సా ముండా 1875 నవంబరు 15న జార్ఖండ్ రాష్ట్రం రాంచీ జిల్లా ఉలిహాటు గ్రామం లో జన్మించారని పేర్కొన్నారు. తన చిన్న వయసులోనే గిరిజన ప్రజల బాధను, ఆంగ్లేయుల అణిచివేతను గమనించారని తెలిపారు. గిరిజనుల భూములు జమీందార్ల చేతికి పోకుండా పోరాడారని వివరించారు. బిర్సాముండా గిరిజనుల హక్కులు, స్వాభిమానం కోసం చేసిన పోరాటం చిరస్మరణీయంగా నిలుస్తుందన్నారు. భారత ప్రభుత్వం ప్రతీ సంవత్సరం నవంబరు 15న జనజాతి గౌరవ దివస్‌గా జరుపుతున్నట్లు తెలిపారు. బిర్సాముండా జయంతిని పురస్కరించుకుని గిరిజన మహోత్సవం, నృత్య పోటీ, వ్యాసరచన పోటీలు, ఆరోగ్యశిబిరం, క్విజ్ పోటీలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని సూచించారు. ఈవీసీలో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి దేశీరాంనాయక్ పాల్గొన్నారు.

జువైనల్ జస్టిస్ బోర్డు ఏర్పాటు

- జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రఫీ



జిల్లా కోర్టులో మాట్లాడుతున్న మహ్మద్ అబ్దుల్ రఫీ

మహబూబాబాద్ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన బాలరక్ష భవన్‌లో ఏర్పాటు చేసిన జువైనల్ జస్టిస్ బోర్డును ప్రతీ గురువారం జిల్లా కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్ విధులు నిర్వహించనున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ గురువారం తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో ఈనెల 10న జరిగే స్పెషల్ లోక్‌అదాలత్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల వయసు ఉన్న బాలలు నేరం చేసినట్లయితే.. వారిని నేరస్తులుగా కాకుండా, చట్టంతో ఘర్షణ పడిన వారుగా గుర్తించి వారిని సాధారణ న్యాయస్థానాల్లో కాకుండా జువైనల్ జస్టిస్ బోర్డు ద్వారా విచారించనున్నట్లు చెప్పారు. ఇటువంటి బాలురకు ఉచితన్యాయ సహాయం అందించడానికి జువైనల్ జస్టిస్ బోర్డులో ఐదుగురు న్యాయవాదులతో కూడిన న్యాయ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ నెల 15న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. లోక్ అదాలత్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి శాలిని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతిమురారి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్, ఆర్డీవో కృష్ణవేణి, డీఎస్పీలు తిరుపతిరావు, కృష్ణకిషోర్, ఏవో క్రాంతికుమార్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి వరంగల్ జిలా కార్యదర్శి కె.రవి అన్నారు. గురువారం తొర్రూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందిచాలని డిమాండ్ చేశారు. తుఫాన్‌తో రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి, పత్తి పంటలు తీవ్రంగా నష్టపోయారని జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల హామీలు అమలు చేయాలని, ఈ నెల 10 వరకు అమరవీరుల వారోత్సవాలు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో విరన్న, యాకయ్య, వెంకన్న, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తొర్రూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు ఆర్టీసీ డిపో పరిధిలోని వివిధ రూట్‌లలో సమస్యల పరిష్కారం, సలహాలు, సూచనల కోసం డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ పద్మావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఆయా రూట్‌లలో ప్రయాణీకులు సలహాలు, సూచనలు తెలియజేయాలని, మరిన్ని వివరాలకు ఫోన్: 9959226053 నంబరుకు కాల్ చేయాలన్నారు.

అమ్మాపురంలో విద్యుదాఘాతం

తొర్రూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమ్మాపురం గ్రామంలో విద్యుదాఘాతంతో ఇంట్లో వస్తువులు దగ్ధమైన సంఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితుడు ఊడుగుల చంద్రమౌళి రేకుల ఇంటి ఆవరణంలో ఉన్న స్విచ్ బోర్డులో షాట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో ఉన్న టీవీ, టీవీ పక్కన పెట్టిన రూ.20వేల నగదు కాలి బూడిదైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పేద కుటుంబానికి చెందిన చంద్రమౌళిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సీఐ రాజ్‌కుమార్‌గౌడ్‌కు సన్మానం

మరిపెడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల సీతారాంపురం పీఎస్ స్కూల్ విద్యార్థులకు రూ.40వేల విలువ చేసే షూ పంపిణీ చేసిన స్థానిక సీఐ రాజ్‌కుమార్‌గౌడ్‌ను ఆ స్కూల్ బాధ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అర్జున్, ఉపాధ్యాయులు మంగీలాల్, మహేశ్‌గౌడ్, వెంకటేశ్వరరావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం వివరాలను నివేదిస్తాం



వెంకటాపురంలో నేల వారిన పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి రాంనర్సయ్య

తొర్రూరురూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్‌లో పంట నష్టపోయిన రైతుల పంటల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని తొర్రూరు వ్యవసాయ అధికారి రాంనర్సయ్య అన్నారు. గురువారం తొర్రూరు మండలం హరిపిరాల, వెంకటాపురం గ్రామాల్లో నష్టపోయిన పంటను క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించారు. రైతులు నేలవాలిన పంటను పైకి కట్టలుగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో వినయ్ వర్మ, రైతులు జాటోత్ యాకూబ్, ఎర్రబోయిన వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి



జీపీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌పీవో పుల్లారావు

దంతాలపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలో పని చేసే పంచాయతీ కార్యదర్శులు మొంతా తుఫాన్‌తో పాటు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తొర్రూరు డీఎల్పీవో పుల్లారావు అన్నారు. గురువారం ఆయన మండలంలోని గున్నేపల్లి, కుమ్మరికుంట్ల గ్రామాలో పర్యటించారు. జీపీ రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందిస్తోన్న తాగునీటిని కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేలా జీపీ సిబ్బందిచే అవగాహన ఏర్పాటు చేయాలన్నారు. డ్యూటీ సమయంలో సిబ్బంది నిర్లక్ష్యం చేయెుద్దన్నారు. ఇటు వైద్య శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండేందుకు అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు సంభవిస్తే తమ దృష్టికి తీసుకోరావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మహ్మద్ అఫ్సరపాషా, పంచాయతీ కార్యదర్శులు సృజన, వుంకన్న తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్ బ్యాగులో నుంచి బంగారం చోరీ

మహబూబాబాద్ క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలోని బస్టాండ్‌లో బంగారం అపహరణకు గురైంది. బస్సు ఎక్కుతున్న మహిళా హ్యాండ్ బ్యాగ్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు 10 తులాల ఆభరణాలను తస్కరించారు. ఈ ఘటన మహబూబాబాద్ పట్టణంలో గురువారం రాత్రి చోటు చేసుకున్నది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఎస్‌కె రజీనా వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం బుధరావుపేట గ్రామంలోని బంధువుల ఇంట్లో శుక్రవారం జరిగే శుభకార్యానికి హాజరయ్యేందుకు అశ్వరావుపేట నుంచి నర్సంపేటకు ఇద్దరు పిల్లలతో ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. మహబూబాబాద్ బస్టాండ్‌లో దిగి టిఫిన్ చేసిన అనంతరం బాధితురాలు రజీనా, ఇద్దరు పిల్లలతో కలిసి బస్సులో బుధరావుపేటకు బయలు దేరారు. మహబూబాబాద్ పట్టణం దాటుతున్న క్రమంలో బస్సు కండక్టర్‌కు ఆధార్ కార్డు చూపించేందుకు హ్యాండ్ బ్యాగ్ ఓపెన్ చేయగా, బ్యాగ్‌లో ఉన్న 10 తులాల ఆభరణాల బాక్స్ లేదు. దీంతో అవాక్కయిన బాధితురాలు బస్సు నిలిపివేసి, అందులో ఉన్న ప్రయాణికులందరిని చెక్ చేసింది. అయినా ఫలితం లేకపోవడంతో తిరిగి మహబూబాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చి టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన సీఐ జి. మహేందర్‌రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలంకు చేరుకొని బాధితురాలు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్‌లోని క్యాంటిన్, పరిసర సీసీ కెమెరాలను పరిశీలించారు. అపహరణకు గురైన బంగారం విలువ సుమారు రూ. 13 లక్షలు ఉంటుంది. అనంతరం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు కేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

తొర్రూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన తొర్రూరు మండలం హరిపిరాల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బాధిత రైతు చెంచర్ల రాజు కథనం ప్రకారం.. రోజు మాదిరగానే గ్రామంలో రాజుకు ఉన్న గేదెలను మేతకు తీసుకెళ్లగా సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వెళ్లు 11 కేవీ వైర్ తెగిపడింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.60వేలు విలువచేసే పాడిగేదె మేతకు వెళ్లి విద్యుత్ షాక్ గురై మృతి చెందింది.

విద్యార్థుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయ

దంతాలపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల పట్ల ప్రభుత్వ వసతి గృహాల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల పరిషత్ అధికారి విజయ్ హెచ్చరించారు. గురువారం ఆమె జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పెద్దముప్పారం, దంతాలపల్లిలోని ప్రభుత్వ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెద్దముప్పారం ఎస్సీ వసతి గృహంలో కనీస విద్యార్థుల శాతం లేకపోవడం పట్ల తీవ్ర ఆసహనం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖీ మాట్లాడారు. ప్రభుత్వం పంపిణీ చేసి నిత్యవసర సరుకులు, విద్యార్థులకు నిత్యం మెను ప్రకారం ఇస్తున్న చార్టును పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వేడివేడి ఆహారంను అందించాలన్నారు. తాగునీటి విషయంలో కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగానే వార్డెను ఉండి విద్యార్థుల బాగోగులను చూసుకోవాలన్నారు. ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను ఉద్దేశించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఇతర ఉపాధ్యాయులు, స్థానిక పంచాయతీ కార్యదర్శి ఏశబోయిన వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో అనితాదేవి

మరిపెడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి క్విజ్, ఉపన్యాస పోటీలకు మరిపెడ మండల విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారని ఎంపీవో అనితాదేవి తెలిపారు. గురువారం ఎంపికైన విద్యార్థులను స్థానిక ఎంఈవో ఆఫీస్‌లో ఆమె అభినందించి మాట్లాడారు. టీ షాట్ మండల స్థాయి క్విజ్, ఉపన్యాస, వ్యాసరచన పోటీలలో బి.లిఖిత (జడ్‌పీఎస్‌ఎస్ గుండెపూడి), బి.స్వాతి (జడ్‌పీఎస్‌ఎస్ మరిపెడ), పి.సాహితి (జడ్‌పీఎస్‌ఎస్ గుండెపూడి) ఎంపికై ఈ నెల 7న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు.

విపత్తుల వల్ల జరిగిన నష్టాలపై ప్రణాళికలు రెడీ



సమావేశంలో మాట్లాడుతున్న మండల్ స్పెషల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్

మరిపెడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విపత్తుల నివారణకై దీర్ఘకాలిక ప్రణాళికలను సిద్ధంచేసి ప్రభుత్వానికి నివేదిస్తున్నట్లు మరిపెడ మండల్ స్పెషల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మరిపెడ మండల్ పరిషత్ ఆఫీస్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం జరిపి మాట్లాడారు. విపత్తుల వల్ల జరిగిన నష్టం, వాటి వివరాలను అధికారుల నుంచి సేకరించామన్నారు. వాటి శాశ్వత నివారణకై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, పీఆర్, మిషన్‌భగీరథ, సాగు నీటిపారుదల ఇంజినీర్లు, ఐసీడీఎస్, వెంటర్నరీ, సర్వేయర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రైతులు ఎరువులను ఇష్టానుసారంగా వాడొద్దు

దంతాలపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రైతులు అధిక మొత్తంలో ఎరువులను వాడడంతో పంట దిగుబడి పొందలేరని స్థానిక వ్యవసాయాధికారి వాహిని అన్నారు. గురువారం ఆమె మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో మాట్లాడారు. రైతులు యూరియాతో పాటు ఇతర పెస్టిసైడ్స్‌లను అధికారుల సలహా, సూచనాల మేరకే వాడాలన్నారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దన్నారు. ఆధార్ కార్డు ప్రకారం రైతులకు ఒక్కొక్క బస్తా యూరియాను ఇస్తున్నామన్నారు. ప్రభుత్వం త్వరలో కావాల్సిన మేరకు యూరియాను పంపిణీ చేయనుందన్నారు. కావాల్సిన రైతులు నేరుగా తమ తమ ఆధార్ కార్డులతో రైతు వేదికలో ఏఈవోలను సంప్రదించాలన్నారు. రైతులు ఇంట్లో యూరియాను నిల్వ ఉంచుకోకూడదన్నారు. అవసరాల మేరకే వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దీక్షిత్‌కుమార్, ఉదయ్‌కిరణ్, పీఏసీఎస్ సీఈవో వెంకన్నగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి

యువకుడి ఆత్మహత్య

కురవి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కురవి మండలం నల్లెల్ల శివారు గాజాతండాకు చెందిన బానోత్ శ్రీకాంత్(22) అనే యువకుడు పురుగుల మందు త్రాగి ఆత్మహత్య చేసుకున్నాడని సీరోలు ఎస్సై గండ్ర సంతోష్ తెలిపారు. అవివాహితుడైన శ్రీకాంత్ మద్యానికి బానిసై ఎలాంటి పనిచేయకుండా తిరిగేవాడని, అక్టోబర్ 20న మద్యం మత్తులో పురుగుల మందు తాగాడని తెలతిపారు. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించగా గురువారం మృతిచెందాడని ఎస్సై తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్ తెలిపారు.

ప్రమాదంలో దేశ ప్రజాస్వామ్యం

● దేశంలో అప్రకటిత ఏమర్జెన్సీ పాలన ● ప్రపంచంలో మూడోవంతు ఆకలి బాధితులు భారత్‌లోనే ● సంస్మరణ సభలో న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు సాధినేని



మాట్లాడుతున్న కేంద్ర కమిటీ సభ్యుడు సాధినేని వెంకటేశ్వరరావు

బయ్యారం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌ఎస్‌ఎస్ మూలాలు కలిగిన ఎన్డీఏ ప్రభుత్వ పాలనతో భారత దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడేలా ఉందని సీపీఐ(ఎంఎల్)-న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు సాధినేని వెంకటేశ్వరరావు, పీవోడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్య ఆందోళన వ్యక్తం చేశారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక గాంధీ సెంటర్ క్రీడా మైదానంలో సంస్మరణ సభ జరిగింది. ఈ సభకు హాజరైన వారు మాట్లాడుతూ పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడి అసువుల బాసిన అమరుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. అమరుల ఆశయ సాధన కోసం పోరాడటమే మనం వారికి అర్పించే ఘననివాళి అన్నారు. వారి ఆశయ సాధన కోసం నేటి యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 75 ఏళ్ల స్వతంత్ర్య భారతంలో అభివృద్ధి జపం కొనసాగుతున్నప్పటికీ ప్రపంచంలో ఆకలితో బాధపడే మూడో వంతు ప్రజలు భారత్‌లోనే ఉన్నారన్నారు. ఇండియాలో దారిద్ర్యం, నిరుద్యోగం తాండవిస్తుందన్నారు. అదాని, అంబాని లాంటి పెట్టుబడిదారులు తమ ఆస్తులు పెంచుకోవడానికి ఉపయోగపడేలా ఎన్డీఏ ప్రభుత్వం సంస్కరణల పేరుతో దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను నాశనం చేస్తుందని విమర్శించారు. ప్రజావ్యతిరేక విధానలకు నిరసనగా పేదల పక్షాన నిలబడి ప్రశ్నిస్తున్న విప్లవకారులు, కమ్యూనిస్టులపై అప్రకటిత యుద్ధం చేస్తున్న ఎన్డీఏ సర్కారు దేశంలో అప్రకటిత ఏమర్జెన్సీ పాలన కొనసాగిస్తుందని ఆరోపించారు. ఇంకా ఈ సభలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పద్మ, ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు బండారి ఐలయ్యలు ప్రసంగించారు. న్యూడెమోక్రసీ నాయకులు మురళీక్రిష్ణ అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో నాయకులు భిక్షం, వీరభద్రం, నాగేశ్వరరావు, రాకేష్, వెంకన్న, పాల్గొన్నారు. అంతకుముందు గ్రామంలో ప్రదర్శన చేపట్టి అమరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు.

కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని రక్షించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రవినాయక్

బయ్యారం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బయ్యారం మండలం జగ్గుతండా పంచాయతీ పరిధిలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని రక్షించే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతూ గురువారం సేవాలాల్ సేన నాయకులు భూక్య రవి నాయక్ మహబూబాబాద్ కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోపోను కలిసి వనతిపత్రం అందజేశారు. అనంతరం రవి నాయక్ మాట్లాడుతూ బయ్యారం రెవెన్యూ పరిధిలోని సుమారు మూడెకరాల ప్రభుత్వ భూమిని దాదాపు 50 ఏళ్ల క్రితం పరిశ్రమ నిమిత్తం ఇరువురు వ్యక్తులు లీజుకు తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ స్థలంలో పరిశ్రమ లేనందున ప్రభుత్వ నిబంధనల ప్రకారం అట్టి స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనపరుచకోవాల్సి ఉంటుందన్నారు. కానీ లీజుదారులు మాత్రం ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించాలని ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. 1/70 చట్టాన్ని ఉల్లంఘించేలా ఏజెన్సీ ప్రాంతంలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని రక్షించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వైన్‌షాప్ వద్దని గ్రామస్థుల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న కాంపల్లి గ్రామస్థులు

కురవి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సీరోలు మండలం కాంపెల్లి గ్రామ నడిబొడ్డున బొడ్రాయి వద్ద వైన్‌షాపు ఏర్పాటు చేయడం వల్ల అనేక రకాలుగా ఇబ్బంది కలుగుతుందని గ్రామస్థులు గురువారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కొప్పుల వెంకట్‌రెడ్డి, గండ్రాతి సత్యం మాట్లాడుతూ గ్రామ నడిబొడ్డున వైన్‌షాపు వల్ల చుట్టు పక్కల బజారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని, దేవాలయానికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని అన్నారు. వైన్‌షాపును గ్రామ చివరకు మార్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎక్సైజ్ పోలీసులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పి.మల్లయ్య, ఎం.వెంకటేశ్వర్లు, రేపాల నరేష్, పి.మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలి

టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాలాష్టి రమేష్

కొత్తగూడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాలాష్టి రమేష్ డిమాండ్ చేశారు. కొత్తగూడ మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నవంబర్ 12, 13న పాఠశాల ముందు, 24న ఐటీడీఏ కార్యాలయాల ముందు, డిసెంబర్ 24న కమిషనర్ కార్యాలయం ముందు నిరసన ప్రదర్శనలు నిర్వహింస్తామని హెచ్చరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల సాంబయ్య, మండల అధ్యక్షుడు తీగల రమేష్, ప్రధాన కార్యదర్శి నరసింహరావు, సూర్యనారాయణ, శంకర్‌లాల్, యాదగిరి పాల్గొన్నారు.



కొత్తగూడలో మాట్లాడుతున్న రమేష్

క్రీడల్లో రాణించిన

విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ : డీడీ



క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న డీడీ దేశీరాంనాయక్

కురవి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ దేశీరాంనాయక్ అన్నారు. కురవిలో గురువారం గిరిజన సంక్షేమ పాఠశాలల విద్యార్థుల మహబుబాబాద్ డివిజన్ స్థాయి క్రీడాపోటీలను ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన విద్యార్థులు శారీరకంగా, మనసికంగా దృడంగా ఉంటారని అన్నారు. జిల్లాలోని ఏడు గిరిజన వసతిగృహాలు, ఐదు పాఠశాలల నుండి 350మంది విద్యార్థులు అండర్-14, అండర్-17 కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు, సెలక్షన్స్‌లో పాల్గొన్నారు. విజేతలకు దేశీరాంనాయక్ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంవో రాములు, జీసీడీవో విజయ, స్పోర్ట్స్ ఆఫీసర్ కొమ్మాలు, జిల్లా సెక్రటరీ అనిల్‌కుమార్, హెచ్‌ఎం బాబు, హెచ్‌డబ్ల్యూవో సునీత, సక్రు, కిషన్, మేక దామోదర్‌రెడ్డి, పీడీలు, శంకర్, అశోక్, సాంబయ్య, రాజన్న, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.


బాధితుడికి ఆరోగ్య పరికరం అందజేత

కొత్తగూడ, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న యాదగిరి గోవర్ధన్‌కు ఆరోగ్య పరికరాన్ని నర్సంపేట ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయం చైర్మన్ మాధవ శంకర్, అధ్యక్షుడు సైప సురేష్ గురువారం అందజేశారు. మండలంలోని గాంధీనగర్‌కు చెందిన యాదగిరి గోవర్ధన్ పలుమార్లు అయప్పమాల ధరించి గురుస్వామిగా కొనసాగుతున్నాడు. గోవర్ధన్ ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న చైర్మన్ మాధవ శంకర్, అధ్యక్షుడు సైప సురేష్, దేవాలయం కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాదం రంజిత్, శ్రీరామ్ కిరణ్, మాలే రాజేష్, ప్రతాపని శ్రీకాంత్, గుండు నవీన్ రూ. 60వేల విలువ గల ఆరోగ్య పరికరాన్ని అందజేశారు.

అధునాతన సాంకేతికత

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

- తొలిసారిగా 16 సర్కిళ్లలో ఏర్పాటు
- లోపాల సవరణకు ఎఫ్‌పీఐలు
- ఆటోమేటిక్ మీటర్ రీడింగ్
- ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి వెల్లడి


సబ్‌స్టేషన్‌లో అమర్చిన ఆధునిక పరికరాలు

హనుమకొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి సాంకేతికంగా అందిపుచ్చుకొని రియల్ టైమ్ ఫీడర్ మానిటరింగ్ సిస్టమ్ (ఆర్‌టీఎఫ్‌ఎం)ను ఎన్‌పీడీసీఎల్‌లోని 16 సర్కిళ్లలో ఏర్పాటు చేశామని సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. దేశంలోని అధునాతన టెక్నాలజీ అయిన ఆర్‌టీఎఫ్‌ఎంను ఎన్‌పీడీసీఎల్‌లో అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో రియల్ టైమ్‌లో కచ్చితమైన సమాచారం పొందగలుగుతామని, తద్వారా వేగవంతంగా చర్యలు చేపట్టవచ్చునని అన్నారు. ఫీడర్ల పర్య వేక్షణ, త్వరగా ప్రతిస్పందించడం ద్వారా అంతరాయాలు గణనీయంగా తగ్గించవచ్చునని తెలిపారు. టెక్నికల్ టీమ్ సభ్యులు ఆరు రాష్ట్రాలలో ఈ సాంకేతిక తను అధ్యయనం చేసిన తర్వాత ఎంచుకున్నామని చెప్పారు. ఒడిశా రాష్ట్రంలో ఈ టెక్నాలజీ వాడుతున్నా రని తెలిపారు. ఎన్‌పీడీసీ ఎల్‌కు అనుగుణంగా ఈ టెక్నాలజీ సరి పడేలా తీర్చిది ద్దామని చెప్పారు. ఈ అధునా తన టెక్నాలజీ ఎన్‌పీడీసీఎల్‌కు ఉపయోగకరంగా ఉందని నిర్ధారించు కున్న తర్వాతనే, ముందుగా ఐదు సబ్‌స్టేషన్లలో ప్రయోగాత్మకంగా పరీక్షించామన్నారు. ఈ 5 సబ్‌స్టేషన్లు స్కాడా కు అనుసంధానం అయిన తర్వాత వచ్చిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా మిగతా 133 సబ్‌స్టేషన్లకు అనుసంధానించామని వివరించారు. మిగిలిన సబ్‌స్టేషన్ల పనులు చురుకుగా సాగుతున్నాయని, లక్ష్యాలను సాధించే దిశగా ఇంజనీర్లు శక్తివంచన లేకుండా కృషి చేస్తు న్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలోని సబ్‌స్టేషన్లకు అవసరా నికి తగ్గట్టుగా తక్కువ ఖర్చుతో ప్రభావంతంగా నిరూపితమైన సమాచార సాంకేతికత రూపొందించామని చెప్పారు. వరంగల్ హెడ్‌క్వార్టర్స్‌లో స్కాడాకు సబ్‌స్టేషన్ల కొరకు కొత్త సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేశామని వరుణ్‌రెడ్డి తెలిపారు. కొత్త సబ్‌స్టేషన్లను దృష్టిలో ఉంచుకొని రాబోయే 15 ఏళ్లకు సంబంధించి సాఫ్ట్‌వేర్ పరంగా సర్వర్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ఆర్‌టీఎఫ్‌ఎంతో ప్రయోజనాలు

ఈ సాంకేతికత వల్ల స్కాడా కంట్రోల్ రూమ్ నుంచి నిర్వహించవచ్చు. రియల్ టైంలో విద్యుత్ అంతరాయం సమాచారాన్ని ఫీల్డ్ సిబ్బందికి తెలియజేసి అతి తక్కువ సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించవచ్చు. ఓవర్‌లోడ్ హెచ్చరికలను ఫీల్డ్ సిబ్బందికి రియల్ టైమ్‌లో తెలియజేయవచ్చు. విద్యుత్ వినియోగం, వోల్టేజీ లెవల్స్ మొదలైన వివరాలను రియల్ టైమ్‌లో సేకరించవచ్చు. కొత్త సాంకేతికతను అందిపుచ్చుకొని వేగవంతంగా విద్యుత్ సమస్యలను పరిష్కరించడం ద్వారా వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంలో రియల్ టైమ్ ఫీడర్ మానిటరింగ్ సిస్టం ఎంతో ప్రయోజనకరమని సీఎండీ తెలిపారు.

ఫాల్ట్ ప్యాసెజ్ ఇండికేటర్లు (ఎఫ్‌పీఐ)

దీనికి అనుసంధాంగా విద్యుత్ సరఫరా వ్యవస్థలో 33 కేవీ, 11 కేవీ సుదూర లైన్లలో ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లను పెడుతున్నామ ని చెప్పారు. బ్రేక్‌డౌన్ సమయంలో ప్రకృతి వైపరీత్యాలు లేదా సాంకేతిక కారణాల వల్ల లైన్ మొత్తం తనఖీ చేసే అవసరం లేకుండా, విద్యుత్ అంతరాయం ఏర్పడిన భాగాన్ని ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్ గుర్తిస్తుంది. తద్వారా అంతరాయం ఏ భాగంలో జరి గిందో వెంటనే విశ్లేషించి, అక్కడికే వెళ్లి విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టడం ద్వారా విద్యుత్ అంతరాయాల సమయాన్ని గణనీయంగా తగ్గించవచ్చునని తెలిపారు. ఫాల్ట్‌ను త్వరగా పున రుద్ధరించడంలో ఎఫ్‌పీఐఎస్ ఎంతో దోహదపడుతున్నాయని వివరించారు. 33,11 కేవీ ఫీడర్లలో 2500 ప్రదేశాల్లో ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లు క్షేత్ర స్థాయిలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించామని తెలిపారు.

ఎఫ్‌పీఐ ప్రయోజనాలు

ఎఫ్‌పీఐ విద్యుత్ సమస్యను, సమాచారాన్ని, స్థానాన్ని వేగంగా గుర్తించి కంట్రోల్ సెంటర్‌కు తెలియజేస్తుంది. సంబంధిత ఫీల్డ్ సిబ్బందికి ఎస్ఎంఎస్ హెచ్చరికలు వెళతాయి. అదే విధంగా ఎఫ్‌పీఐ ద్వారా ప్రదేశంలో ఫ్లాష్‌లైట్ సూచన కూడా కనిపిస్తుంది. ఫీల్డ్ సిబ్బంది మొత్తం లైన్‌లో పెట్రోలింగ్ చేయకుండా నేరుగా సమస్య ఉన్న భాగాన్ని గుర్తించగలుగుతారు. దీనివల్ల ఫాల్ట్ డిటెక్షన్, పునరుద్ధరణ సమయం ఆదా అవుతుంది.

ఆటోమేటిక్ మీటర్ రీడింగ్

హెచ్‌టీ విద్యుత్ వినియోగదారులకు బిల్లుల అందజేతలో వేగం, పారదర్శకత పెంచేందుకు ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ (ఏఎంఆర్) వ్యవస్థను రూపొందించామని తెలిపారు. విద్యుత్ వినియోగదారు లకు మాన్యువల్ బిల్లింగ్ సమస్యలు లేకుండా ఉండేందుకు ఏఎంఆర్ విధానం ఎంతో ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా సర్కిల్‌లో అధిక సామర్థ్యంతో విద్యుత్ వినియోగించే పరిశ్రలకు వీటిని ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఆటోమెటిక్ మీటర్ రీడింగ్ విధానం వల్ల తప్పులు జరిగే అవకాశం ఉండదని, విద్యుత్ సరఫరాలో వచ్చే హెచ్చు తగ్గులను త్వరితగతిన గుర్తించవచ్చునని తెలిపారు. సిబ్బంది సమయం వృథా కాదని సీఎండీ పేర్కొన్నారు.


ఎన్‌పీడీసీఎల్ ఏర్పాటు చేసిన సరికొత్త సాంకేతిక యంత్రాలు



డీన్ కార్యాలయం వద్ద బైఠాయించిన పీహెచ్‌డీ ఆశావహ అభ్యర్థులు

పీహెచ్‌డీ ప్రవేశాల్లో గందరగోళం

- సీట్లు పెంచాలని అభ్యర్థుల ఆందోళన
- డీన్ ఆఫీస్ ఎదుట బైఠాయింపు
- కేయూ వీసీ, రిజిస్ట్రార్లను కలిసి వినతి

కేయూ క్యాంపస్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం పీహెచ్‌డీ అడ్మిషన్ల రీషెడ్యూల్ ఇంటర్వ్యూ ప్రక్రియ గందరగోళంగా మారింది. గురువారం ఉదయం కేయూక్యాంపస్‌లోని డీన్ కార్యాలయం ఎదుట పీహెచ్‌డీ అభ్యర్థులకు రీ ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు సమాయత్తం అయ్యారు. ఈ క్రమంలో అభ్యర్థులందరూ ఇంటర్వ్యూల ప్రక్రియను అడ్డుకున్నారు. గతంలో నిర్వహించిన తెలుగు పీహెచ్‌డీ అడ్మిషన్ల ఇంటర్వ్యూలు ఎందుకు రద్దు చేసి రీషెడ్యూల్ ప్రకటించారని అభ్యర్థులు వర్సిటీ ఉన్నతాధికారులను నిలదీశారు. డీన్ కార్యాలయం ఎదుట బైఠాయించి పెద్దఎత్తున నినాదాలు చేశారు. తెలుగు విభాగంలో ఆశావహులైన పీహెచ్‌డీ అభ్యర్థులు ఎక్కువగా ఉన్నారని, సీట్లు రెండు ఉన్నాయని, వాటి సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు.

అభ్యర్థుల ఆందోళన నేపథ్యంలో డీన్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ వర్సిటీ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వర్సిటీ ఉన్నతాధికారుల ఆదేశాలతో అభ్యర్థుల గొడవ నేపథ్యంలో పోలీసులు డీన్ కార్యాలయానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అభ్యర్థులను శాంతించేందుకు ప్రయత్నించారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. సీట్ల పెంపు అంశం తన పరిధిలో లేదని, వీసీ దృష్టికి తీసుకుపోతామని ఆర్ట్స్ విభాగం ఇన్‌చార్జి డీన్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ ప్రకటించారు. పీహెచ్‌డీ అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు వర్సిటీ పరిపాలన భవనానికి చేరుకుని వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డికి తమ డిమాండ్లను విన్నవించారు. వీసీ, రిజిస్ట్రార్లకు తెలుగు విభాగంలో సీట్ల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. సీట్ల పెంపు ఇప్పటికిప్పుడు సాధ్యం కాదని, డీన్ కార్యాలయంలో అర్హులైన అధ్యాపకులు దరఖాస్తులు చేసుకోవాలని, మళ్లీ నోటిఫికేషన్‌లో వారికి సీట్ల కేటాయించేలా ప్రయత్నిస్తామని వీసీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. తమకు ఇప్పటి నోటిఫికేషన్‌లోనే సీట్లను పెంచి ఇంటర్వ్యూలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిబంధనల మేరకు నోటిఫికేషన్ ఇచ్చిన సీట్ల సంఖ్య పెంచడం సాధ్యంకాదని స్పష్టం చేశారు. 2022 పీహెచ్‌డీ ఎంట్రెన్స్‌లో అన్ని విభాగాల్లో సీట్లు పెంచి ఆశావహులైన అభ్యర్థులకు అడ్మిషన్లు కల్పించగా, తెలుగు విభాగంలో కొద్దిమందికే అవకాశం కల్పించారని అభ్యర్థులు అధికారులకు విన్నవించారు.

ఇదిలాఉండగా, తెలుగు విభాగంలో నిర్వహించిన పీహెచ్‌డీ ఇంటర్వ్యూలలో అవకతవకలు జరిగాయని వర్సిటీ ఉన్నతాధికారులు రద్దు చేశారు. ఈ దఫా పకడ్బందీగా పీహెచ్‌డీ అడ్మిషన్లు నిర్వహించాలని భావించిన కేయూ ఉన్నతాధికారులు తిరుపతిలోని పద్మావతి మహిళ వర్సిటీ సీనియర్ ప్రొఫెసర్‌తోపాటు నాగార్జున వర్సిటీ తెలుగు విభాగం సీనియర్ ప్రొఫెసర్లను ఎక్స్‌టర్నల్, ఇంటర్నల్ సబ్జెక్టు ఎక్స్‌పర్టులతో కమిటీని నిర్వహించారు. కాగా కేయూ తెలుగు విభాగం విభాగం రిటైర్డు ప్రొఫెసర్ ఇంటర్నల్ సబ్జెక్టు ఎక్స్‌పర్టుగా ఉండి అవకతవకలకు పాల్పడిన అంశాలపై వర్సిటీ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఈ ఆందోళనలో తెలుగు పీహెచ్‌డీ ఆశావహులైన అభ్యర్థులు రాజు, యాదగిరి, సునీల్, శైలజ, తిరుపతితో పాటు దివ్యాంగులు పాల్గొన్నారు.

గురుకుల జోనల్ పోటీలు అదుర్స్!

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి : మల్టీ జోనల్ అధికారి అలివేలు


క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరిస్తున్న అధికారులు

మరిపెడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి మల్టీ జోనల్ క్రీడా పోటీలు అదుర్స్ అనిపించాయి. గురువారం మరిపెడ సోషల్ వెల్ఫేర్ గురుకులంలో ఈ పోటీలను సాంఘిక సంక్షేమ గురుకుల జోనల్ స్థాయి అధికారులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. భద్రాద్రి జోన్ పరిధిలోని 11 గురుకులాల నుంచి మొత్తం 935 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, రన్నింగ్, హై, లాంగ్ జంప్ తదితర పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అతిథులకు వివిధ గురుకులాల విద్యార్థులు గౌరవ వందనం సమర్పించి ఘన స్వాగతం పలికారు. మల్టీ జోనల్ అధికారి అలివేలు క్రీడా జ్యోతిని విద్యార్థులకు అందించి పోటీలను ప్రారంభించారు. డ్యాన్స్‌తో విద్యార్థులు హోరెత్తించారు. తొలి రోజు నుంచే పోటీలు రసవత్తరంగా సాగాయి. కార్యక్రమంలో డీసీవో జాక్వెలిన్, క్రీడల అధికారి రూత్మనీ, డీఎంహెచ్‌వో రవిరాథోడ్, డీపీఏహెచ్‌వో కిరణ్‌కుమార్, తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ విజయానంద్, ఎస్సై వీరభద్రరావు, డాక్టర్ రవినాయక్, ప్రిన్సిపాల్ దయాకర్, వివిధ గురుకులాల ప్రిన్సిపాళ్లు, పీడీ, పీఈటీలు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగించుకొని ఉన్నత శిఖిరాలకు చేరుకోవాలని భద్రాద్రి మల్టీజోన్ అధికారి అలివేలు ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. మరిపెడ ఎస్సీ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న 11వ జోనల్ పోటీల్లో ఆమె మాట్లాడారు. విద్యార్థులు గెలుపోటములను సహజంగా తీసుకొని మెళకువలను నేర్చుకోవాలని కోరారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో మెలిగితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని గుర్తు చేశారు. పోటీలకు హాజరైన విద్యార్థులను అభినందిస్తూ మల్టీజోన్ నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎదగాలన్నారు.

ప్రజా ఉద్యమాల ద్వారానే బీసీ రిజర్వేషన్ల అమలు

- 9వ షెడ్యూల్‌లో బిల్లును చేర్చాలని కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- బీసీ దీక్షలో టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్


నర్సంపేటలో బీసీ దీక్ష వద్ద మాట్లాడుతున్న అంబటి శ్రీనివాస్

నర్సంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఉద్యమాల ద్వారానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలవుతాయని తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సోల్తి సారయ్య ఆధ్వర్యంలో నర్సంపేటలోని అంబేద్కర్ సెంటర్‌లో గురువారం ఒక రోజు బీసీ దీక్షను నిర్వహించారు. దీక్షను ప్రారంభించిన అనంతరం అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో రిజర్వేషన్ల బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపించినంత మాత్రాన 42 శాతం రిజర్వేషన్లు అమలు కావాలన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును ప్రవేశ పెట్టి రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్‌లో చేర్చినప్పుడే బీసీ రిజర్వేషన్లు అమలు సాధ్యమవుతుందన్నారు. రిజర్వేషన్ల అమలుకోసం కేంద్రంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకతీతంగా ప్రజా ఉద్యమాలు నిర్వహించి కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తే 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే అవకాశాలు ఉంటాయని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో 42శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

వడ్డెర సంఘం నాయకుడు ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ ఓర్సు తిరుపతి, బీసీ నాయకుడు గుంటి రాంచందర్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సోల్తి సారయ్య మాట్లాడుతూ.. బీసీలను ఓటు బ్యాంక్‌గానే వినియోగించుకుంటున్నారే తప్ప జనాభా ప్రాతిపదికన బీసీలకు అన్ని రంగాలలో న్యాయం చేయడం లేదన్నారు. జెండాలు పక్కకు పెట్టి 42 శాతం రిజర్వేషన్ల అమలుకోసం ఉద్యమాలు కొనసాగించాలని వారు పిలుపునిచ్చారు. మాజీ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రెండు వేర్వేరు బిల్లులను శాసనసభలో ఆమోదించి కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం పంపి 7నెలలు గడిచిపోతున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో చేర్చకుండా బీసీలకు అన్యాయం చేస్తుందని ఆయన అన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులను గ్రామాల్లో తిరగ కుండా చేస్తే దిగివచ్చి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్ల బిల్లును చేరుస్తుందని ఆయన అన్నారు. ఇంటలెక్చువల్స్ ఫోరం చీఫ్ కో-ఆర్డినేటర్ వీరస్వామి మాట్లాడుతూ.. రాజ్యాంగ సవరణ పేరులో 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయకుండా బీజేపీ నాయకులు బీసీలను మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ నీలారపు నరేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సోల్తి రవి, జిల్లా కో-ఆర్డినేటర్ సాంబరాతి మల్లేశం, సోమ రాంమూర్తి, గండు రవి, వివిధ సంఘాల నాయకులు పంజాల వెంకట్, పులిగిల్ల యాదగిరి, డాక్టర్ జగదీశ్వర్, ఆబోతురాజు యాదవ్, సోల్తి మధు. సోల్తి సాయికుమార్, భిక్షపతి, బూస అశోక్, శివరాత్రి స్వామి, మనోహర్, గౌడ సంఘం అధ్యక్షుడు కోల వెంకటేశ్వర్లు, తాళ్లపెల్లి చంద్రమౌళి. మద్దెల శ్రీనివాస్, సీపీఐ నాయకులు పంజాల రమేశ్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. దీక్ష చేపట్టిన బీసీ నాయకులకు డాక్టర్ వీఎం.జయుడు, మాజీ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, రాముమ్మార్తి, జాటోత్ బాలునాయక్, నిమ్మరసం అందించి దీక్షను విరమింప జేశారు.

నగరంలో మెరిసిన శ్రీలీల

(5వ పేజీ తరువాయి)

చూడాలనుకుంటున్నాను...' అని హుషారుగా మాట్లాడారు. కొత్తదనం కోరుకునే షాపింగ్ ప్రియులకు సరికొత్త షాపింగ్ ప్రపంచం ఆర్.ఎస్. బ్రదర్స్ అని తెలిపారు. సంస్థ చైర్మన్ పొట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దక్షిణ భారతంలో విస్తరణలో భాగంగా వరంగల్ మహానగరంలో సరికొత్త షాపింగ్ మాల్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కుటుంబంలోని అన్ని తరాలవారి అభిరుచులకు అనుగుణంగా వైవిధ్యభరితమైన, నాణ్యమైన ఆకర్షణీయమైన ఉమెన్స్, కిడ్స్, మెన్స్ వేర్ వస్త్రాలు అందుబాటు ధరలతో లభ్యమవుతాయని తెలిపారు.

కాగా, శ్రీలీల రాకతో ఆర్ఎస్ బ్రదర్స్ షాపింగ్‌మాల్‌ప్రాంతం సందడిగా మారింది. తాను నటించిన వివిధ సినిమాల ట్రెండింగ్ పాటలు డీజేలతో హోరెత్తుతుండగా... అభిమానులను అలరిస్తూ మాట్లాడారు. అభిమాని ఒకరు తాను చిత్రించిన శ్రీలీల ఫొటోను చూపగా, ఆమె వెంటనే అతడిని స్టేజిపైకి పిలిచి ఆ చిత్రాన్ని అందరికీ చూపుతూ అభినందించారు. అభిమానులు స్టెప్స్ వేయాలని కోరగా.. 'మీరు వేస్తే నేను చూస్తాను..' అని ఆమె చెప్పడంతో అభిమానులు హుషారుగా స్టెప్స్ వేశారు. ఆర్ఎస్ బ్రదర్స్ షోరూమ్‌ను స్టేషన్‌రోడ్డులోని పాత సునీల్ థియేటర్ స్థలంలో ఏర్పాటు చేశారు.

కార్మిక శాఖలో దళారుల మాయాజాలం

- కార్మికురాలు బతికుండగానే మృతి చెందినట్లు డెత్ సర్టిఫికెట్
- వెలుగు చూస్తున్న విచిత్ర ఘటనలు
- నిధుల కాజేతకు యత్నం


విచారణ కోసం కార్మిక శాఖ కార్యాలయానికి వచ్చిన కార్మిక నాయకులు

బాలసముద్రం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంక్షేమ నిధులు కాజేసేందుకు కొందరు దళారులు అధికారులను బురిడి కొట్టించేందుకు యత్నించిన ఘటన వెలుగు చూసింది. లేబర్ కార్డు కలిగి ఉన్న ఒక కార్మికురాలు బతికుండగానే ప్రమాదవశాత్తు చనిపోయినట్లు నకిలీ డెత్ సర్టిఫికెట్ సృష్టించి ఈ-సేవలో క్లెయిమ్ రిజిస్ట్రేషన్ అప్‌లోడ్ చేశారు. సుమారు ఆరు నెలల క్రితం లేబర్ కార్డు కలిగి ఉన్న వరంగల్ మండలం కొత్తపేట గ్రామానికి చెందిన రాసమల్ల రజితకు ప్రమాదవశాత్తు కాలికి గాయం కావడంతో సంక్షేమ నిధి నుంచి డబ్బుల కోసం కార్డు పట్టుకొని హనుమకొండలోని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి వచ్చారు. కార్డు నంబర్‌తో రికార్డులను పరిశీలించిన అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సదరు కార్మికురాలు రజిత మృతి చెందినట్లుగా క్లెయిమ్ కోసం డెత్ సర్టిఫికెట్ సమర్పించినట్లు కంప్యూటర్‌లో చూసి విస్తుపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేయాలని కార్మికురాలికి సలహా ఇచ్చారు. అంత రాద్ధాంతం ఎందుకని కార్మికురాలి కుటుంబ సభ్యులు మిన్నకున్నారు.

గత మంగళవారం వరంగల్ జిల్లా కొత్తపేటకు చెందిన రాసమల్ల రజిత బతికుండగానే మృతి చెందినట్లు డెత్ సర్టిఫికెట్ సృష్టించి రూ. 6 లక్షల 30 వేల నిధులు దళారులు దండుకున్నారని ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం కావడంతో ఆమె కుటుంబ సభ్యులు కంగుతిన్నారు. బుధవారం సెలవురోజు కావడంతో గురువారం కార్మికురాలి కుటుంబ సభ్యులు కార్మిక శాఖ కార్యాలయానికి చేరుకొని అధికారులను నిలదీశారు. తాము అక్రమంగా నిధులు కాజేసినట్లు తమ కుటుంబాన్ని గ్రామస్థులు అనుమానిస్తున్నారని వాపోయారు. ఇంతలో అక్కడికి చేరుకున్న భవన నిర్మాణ కార్మిక సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు చిలువేరు రాజేందర్, ఇతర కార్మిక నాయకులు మహ్మద్ గౌస్, అజీమొద్దీన్, భిక్షపతి ఆరా తీశారు. అందుకు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ రజిత సమాధానమిస్తూ ఎవరో క్లెయిమ్ కోసం అప్‌లోడ్ చేశారని అందుకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లను సమర్పించలేదని వివరించారు. ఈ విషయంపై తమ అధికారి, సంక్షేమ బోర్డు, బాధితురాలికి లెటర్ పెట్టినట్లు తెలిపారు.

- ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు చిలువేరు రాజేందర్ మాట్లాడుతూ.. కార్యాలయంలో దళారులు రాజ్యమేలుతున్నారని కార్మికులు కానివారికి లేబర్ కార్డులను ఇప్పిస్తున్నారని అసలైన కార్మికులు దరఖాస్తులను సమర్పించేందుకు వస్తే కొందరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు అనేక కొర్రీలను పెడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై కార్మిక శాఖ ఉన్నతాధికారులు విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

లైంగిక దాడుల నివారణకు అప్రమత్తత అవసరం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే


సమావేశంలో మాట్లాడుతున్న క్షమాదేశ్ పాండే

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాలలపై జరుగుతున్న లైంగిక దాడుల నివారణకు అవగాహన, అప్రమత్తత అవసరమని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే అన్నారు. న్యాయ సేవా అధికార సంస్థ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ సుబేదారిలోని అసుంత భవన్‌లో గురువారం ఆన్‌లైన్‌లో చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేషన్, చైల్డ్ మ్యారేజ్ ప్రివెన్షన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా క్షమాదేశ్‌పాండే మాట్లాడుతూ.. ఆన్‌లైన్ లైంగిక వేధింపులపై సమాజానికి అవగాహన కల్పించాలన్నారు. పాఠశాల, కళాశాలల విద్యార్థులకు బాలల హక్కులు, సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని, నేటి విద్యార్థులు మొబైల్‌ఫోన్లకు అలవాటు పడి ఆన్‌లైన్ గేమ్స్, ఇతర ఆప్షన్లు డౌన్‌లోడ్ చేసుకుని అనేక సమస్యల్లో చిక్కుకుంటున్నారన్నారు. సైబర్ మోసాల పట్ల జాగ్రత్త వహించాలని, ఆన్‌లైన్ మోసాలకు గురైతే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఈ అవగాహన సదస్సులో జిల్లా సంక్షేమ అధికారి కె.జయంతి, పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైం ఏసీపీ గిరికుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య, సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు ఎర్ర శ్రీకాంత్, బత్తుల కరుణ, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సభ్యులు దామోదర్, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఎస్.ప్రవీణ్‌కుమార్, ఎస్.భాస్కర్, శ్యాంసుందర్, సునిత, విశ్వజ, స్వరూప, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు కేయూలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కేయూ క్యాంపస్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ప్రాంగణంలోని మొదటి అంతస్తుతో పాటు పరీక్షల విభాగంలో స్టోర్‌రూమ్ నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నట్లు వర్సిటీ ఉన్నతాధికారులు తెలిపారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్‌కట్ల రాజేందర్‌లు పాల్గొంటారని కేయూ డీవో ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డి తెలిపారు.



ఎర్రగడ్డ ప్రాంతంలో బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డి తరపున ప్రచారం చేస్తున్న బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు సీతయ్య తదితరులు



రహమత్ నగర్ డివిజన్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి సునిత తరపున ప్రచారం నిర్వహిస్తున్న రాంమోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు



కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ తరపున బోరాబండ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో నేతలు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో తమ తమ పార్టీల అభ్యర్థుల తరపున మానుకోట జిల్లాకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ తరపున మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోతు రాంచందర్‌నాయక్, మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌తో పాటు కాంగ్రెస్ నేతలుప్రచారంలో పాల్గొంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ నేతృత్వంలో బోరాబండ డివిజన్‌లో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్‌నాయక్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు స్వర్ణలత తదితరులు ప్రచారం చేస్తున్నారు. మరోపక్క బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునిత తరపున జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, రాష్ట్ర మాజీమంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ మాలోతు కవిత ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. రహమత్‌నగర్ డివిజన్‌లో మునిసిపల్ మాజీ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, ఎడ్ల వేణు, మార్నేని రఘు, మంగలంపల్లి కన్న, దౌలాగర్ శంకర్, అంబాల శివ, కర్పూరపు గోపి ప్రచారంలో పాల్గొన్నారు.

ఇక బీజేపీ అభ్యర్థి లంక దీపక్‌రెడ్డి తరపున ఎర్రగడ్డ ప్రాంతంలో మాజీ జిల్లా అధ్యక్షుడు యాప సీతయ్య, వద్దిరాజు రాంచందర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు చీకటి మహేష్‌గౌడ్, మదన్‌నాయక్, జిల్లా కార్యదర్శి సింగారపు సతీష్ ప్రచారం చేపడుతున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు

● సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాధం భవన్‌లో సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశాన్ని ఆకుల రాజు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రం వైఖరిని నిరసిస్తూ ఈనెల 26న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే ప్రదర్శనలను విజయవతం చేయాలనికోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లెబర్‌కోడ్‌లు తెచ్చి శ్రమదోపిడీకి పాల్పడుతుందని, రైతుల పంటలకు గిట్టుబాటు ధర చెల్లించక అన్నదాతలను మోసం చేస్తుందని, ఉపాధి హామికి తూట్లు పొడిచి బడ్జెట్‌లో నిధులు తగ్గించారని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనాలు, సౌకర్యాలు అమలు చేయాలని, ఉపాధి హామి పని దినాలు పెంచాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ మాట్లాడుతూ...లేబర్‌కోడ్‌లను దొడ్డిదారిన అమలు చేసేందుకు కేంద్రం నూతనంగా శ్రమశక్తి నీతి 2025 పేరుతో లేబర్ పాలసీ ప్రకటించిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ లేబర్ పాలసీ- కార్మిక వర్గంపై ప్రభావం అనే అంశంపై ఈ నెల 7న జిల్లా కేంద్రంలో సెమినార్ నిర్వహిస్తున్నామని దీనికి ముఖ్యవక్తగా సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం. సాయి బాబా హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, కార్యదర్శి కాసు మాధవి, జిల్లా ఆఫీస్ బేరర్స్ శ్రీనివాస్, రాజమౌళి, వీరన్న, నాగన్న, మల్లయ్య, మౌనిక, స్నేహబిందు, సంపూర్ణ పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమిద్దాం

సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నేత లింగన్న

మహబూబాబాద్ రూరల్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి) : భూమి కోసం.. భుక్తి కోసం ఈ దేశ విముక్తి కోసం అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమద్దామని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు హెచ్.లింగన్న, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ మండలం రెడ్యాల గ్రామంలో గురువారం అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో పాలకవర్గ పార్టీలు ఆపరేషన్ కగార్ పేరుత ఆదివాసీ పక్షాన పోరాడుతున్న విప్లవ వారులను హతమారుస్తున్నారన్నారు. నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యంగా పోరాటం కొనసాగించగా బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో వందలాది మంది విప్లవకారులు హతమైనట్లు పేర్కొన్నారు. నాగరాజు, లింగన్న, భీముడు, రమేష్, వెంకన్న, సురేష్, లక్ష్మీ పాల్గొన్నారు.



రెడ్యాలలో మాట్లాడుతున్న ఎన్డీ నేతలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

సైబర్ సేఫ్టీపై అవగాహన ఉండాలి : సీఐ

కేసముద్రం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కళాశాల స్థాయి విద్యార్థులు సైబర్ సేఫ్టీపై అవగాహన కలిగి ఉండాలని కేసముద్రం సీఐ వై.సత్యనారాయణ సూచించారు. మండలంలోని కల్వల మోడల్ స్కూల్లో గురువారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాట్సా‌ప్‌లో ఏపీకే ఫైల్స్‌తో వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని, వాటిలో బ్యాంకు ఖాతాల్లోని డబ్బులను కొల్లగొట్టే మాల్‌వేర్‌లు ఉంటాయని తెలిపారు. అలాంటి ఏపీకే లింకులను వెంటనే గ్రూపులోంచి డెలీట్ చేయాలని తెలిపారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో చాటింగ్, ఫాలోయింగ్ చేయవద్దని తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లు ఆడవద్దని, వాటితో డబ్బులు పోగొట్టుకొని ఎన్నో కుటుంబాలు నాశనమయ్యాయని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ సేఫ్టీపై విద్యార్థులు ఇతరులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కె.క్రాంతికిరణ్, నరేష్, ఇనుగుర్తి ఎస్ఐ జి.కరుణాకర్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూలే విగ్రహం ఎదుట మౌనదీక్ష

నెహ్రూసెంటర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని కోరుతూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జ్యోతిబాపూలే విగ్రహం ఎదుట గురువారం మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ గుండగాని మధు మాట్లాడుతూ బీసీలకు స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి నేటి వరకు అన్యాయం జరుగుతుందని, కేవలం బీసీలను అన్ని రాజకీయ పార్టీలు జెండాలు మోసే వారిగానే చూస్తున్నారని ఆరోపించారు. బీసీలతో జిందాబాద్‌లు కొట్టించుకుని వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు రాజ్యాధికారంలో తగిన వాటా దక్కనీయడం లేదని చెప్పారు. తక్షణమే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కేటాయించి చట్ట సభల్లో ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. గండి వీరేందర్‌గౌడ్, ముంజాల రాజేందర్‌గౌడ్, చందా గోపి, చెన్నూరి విజయలక్ష్మి, రాందాసు, పెద్ది వెంకన్న, మారగాని రాజు, బొమ్మకంటి వెంకట్, శ్రీనివాస్, బుడిగే భద్రసేన, అల్లి దుర్గేష్, గాడిపెల్లి చరణ్ పాల్గొన్నారు.



మౌనదీక్ష చేస్తున్న బీసీ జేఏసీ నేతలు

పాముకాటుతో వృద్ధుడి మృతి



అంజయ్య(ఫైల్)

కేసముద్రం, నవంబరు6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపల్లిలో అరిగె అంజయ్య (65) గురువారం పాము కాటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. తెల్లవారు జామున 5 గంటల ప్రాంతంలో ఇంటి వద్ద పాము కాటు వేయడంతో కుటుంబ సభ్యులు ఆ పామును గురించి చంపివేశారు. అయితే ఆయన కాలికి పక్షవాతం వచ్చి తగ్గడంతో పాము కాటు వేసిన విషయాన్ని ఆయన గుర్తించలేకపోయాడు. ఉదయం 9 గంటల ప్రాంతంలో గుండెలో తీవ్ర నొప్పి వచ్చి అస్వస్థతకు గురికాగా ఆయన్ను వరంగల్ ఎంజీఎంకు తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు. మృతునికి భార్య పూలమ్మ, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

మహబూబాబాద్ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం ధర్మన్న కాలనీలో గురువారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. పట్టణంలోని ధర్మన్న కాలనీకి చెందిన వడ్లకొండ రత్తయ్య (54) ఫాస్టర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 2న తన ద్విచక్ర వాహనంపై రత్తయ్య తన సతీమణి పద్మను తీసుకుని కంబాలపల్లి గ్రామంలో ప్రార్థన చేసేందుకు వెళ్తుండగా, బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ఘటనలో రత్తయ్య తలకు తీవ్రగాయాలు కాగా, భార్య పద్మకు కూడా గాయాలయ్యాయి. ఇరువురిని 108 ద్వారా మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. రత్తయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రత్తయ్య అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు, మృతునికి భార్యపద్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికారెడ్డి తెలిపారు.

ఎంఈవోను సర్వీస్ నుంచి తొలగించాలి

మహబూబాబాద్ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సీరోలు మండల విద్యాశాధికారి (ఎంఈవో) లచ్చారాంనాయక్‌ను సర్వీస్ నుంచి తొలగించాలని డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి సాయికుమార్, కోశాధికారి సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. వరంగల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) కార్యాలయంలో గురువారం సూపరిండెంట్ ప్రణీత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీరోలు మండల విద్యాశాధికారిగా విధులు నిర్వహిస్తున్న లచ్చిరాంనాయక్ సీరోలు మండల కేంద్రంలో మండల విద్యావనరుల కేంద్రం (ఎమ్మార్సీ) అభివృద్ధికి కేటాయించిన రూ.82 వేల నిధులను స్వంత ఖాతాలోకి మళ్లించుకున్నారని ఆరోపించారు. ఎమ్మార్సీ కార్యాలయం సీరోలు మండల కేంద్రంలో లేనప్పటికీ కార్యాలయానికి వచ్చిన నిధులను డ్రా చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టి, ఆ అధికారిని సర్వీస్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దేవేందర్, గణేష్, శివ, ఆకాష్, చరణ్ పాల్గొన్నారు.

శీతకన్ను

(5వ పేజీ తరువాయి)

ములుగు జిల్లా పస్రా మీదుగా (40 కిలోమీటర్ల ప్రయాణం ద్వారా) మేడారంకు చేరుకుంటారు. పూనుగొండ్ల నుంచి దుబ్బగూడెం వరకు ఉన్న రోడ్డు పెద్ద పెద్ద గుంతలతో అధ్వానంగా మారింది.

కొరవడిన సౌకర్యాలు..

పగిడిద్దరాజు ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యాలు కరువయ్యాయి. బారీషెడ్లు, చలువ పందిళ్లు లేవు. భక్తులు స్నానాలు చేసేందుకు అవసరమైన గదులు లేవు. మహిళలు దుస్తులు మార్చుకోవటానికి గదులులేవు. తుంపర స్నానాలు ఏర్పాటు చేయలేదు. మంచినీటి కొరకు బోర్లువేయలేదు. చివరికి మరుగుదొడ్లు కూడా లేవని గిరిజనులు వాపోతున్నారు. ఇక్కడ స్నానాల గదులకు తలపులు లేవని మరుగుదొడ్లు పాడై నిరుపయోగంగా ఉన్నాయని గిరిజనులు వాపోతున్నారు. గిరిజనులు చందాలు వేసుకుని నిర్మాణం చేసుకున్న ఆలయంలోనే స్వామివారికి పూజలు జరుగుతున్నాయి. స్వామివారి విగ్రహన్ని ఏర్పాటు చేసి ఆ ఆలయానికి గోపుర నిర్మాణం చేయాలనే ఆదివాసీల కళ నేటికి సాకారం కాలేదు. అంతే కాకుండా ఆలయం శిధిలావస్థకు చేరుకుంటుంది. ప్రతి ఏటా ఆలయానికి రంగులు వేసి మెరుగులు దిద్దుతున్నారే తప్ప నూతన ఆలయం నిర్మాణం చేపట్టడంలేదని గిరిజనులు వాపోతున్నారు.

అంజయ్య ఆశయాలను కొనసాగించాలి



అంజయ్య స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

నెల్లికుదురు నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల కోసం ఆశువులు బాసిన బట్టు అంజయ్య అలియాస్ సురేషన్న ఆశయాలను కొనసాగించాని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఉడుగుల లింగన్న తెలిపారు. అమరవీరుల వారోత్సవాలలో భాగంగా గురువారం మండలంలోని రావిరాలలో బట్టు అంజయ్య అలియాస్ సురేషన్న స్థూపం వద్ద జెండా ఎగరవేసి నివాళులు అర్పించారు. బట్టు చైతన్య, చిర్ర యాకన్న, చిమ్మల కమాలకర్ ఇస్లావత్ బాలాజీ, ఏలె శ్రీను, సురేష్ రమేష్ పాల్గొన్నారు.

ట్రస్మా ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



ట్రస్మా పోటీల్లో మాట్లాడుతున్న చిర్ర యాకాంతంగౌడ్

కేసముద్రం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ట్రస్మా) ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా స్థాయిలో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, ఖోఖక్ష క్రీడా పోటీలను ఈనెల 14న జమాండ్లపల్లి విద్యాభారతి పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిర్ర యాకాంతగౌడ్ తెలిపారు. కేసముద్రం మునిసిపాలిటీ సబ్‌స్టేషన్‌తండాలో సేయింట్ జాన్స్ స్కూల్లో మండల స్థాయి ఎంపిక పోటీలను గురువారం ఎంఈవో కాలేరు యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా యాకాంతంగౌడ్ మాట్లాడుతూ ఏడో తరగతి వరకు జూనియర్, ఎనిమిది నుంచి పదో తరగతి వరకు సీనియర్ విభాగాల్లో ఈ పోటీలను నిర్వస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జోన్ అధ్యక్షుడు జోగు డాంగయ్య, గంజి వీరేందర్‌రెడ్డి, చిన్నాల కట్టయ్య, శ్రవణ్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్ నూతన భవన నిర్మాణ సమయంలో నాటి ప్రభుత్వం సాలార్‌తండా గిరిజన రైతుల భూములు లాక్కుంటూంటే వారి పక్షాన పోరాడిన వామపక్ష నేతలు, గిరిజన రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. భూపోరాట కేసులో మహబూబాబాద్ జిల్లా కోర్టుకు సాదుల శ్రీనివాస్‌తో పాటు సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, గిరిజన రైతులు ఆంగోతు శివాజీ, సురేందర్, మంగ్యా, బాలాజీ, వెంకన్న, వీరు గురువారం హాజరయ్యారు.ఈ సందర్భంగా సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ...సీపీఐ, సీపీఎం పోరాట ఫలితంగానే గిరిజన రైతులకు ప్రభుత్వం నుంచి ఎకరాకు రూ.21 లక్షల పరిహారం అందిందని చెప్పారు. నాటి బీఆర్ఎస్ పాలనలో భూపోరాట సమయంలో వామపక్ష నేతలు, గిరిజన రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

రాష్ట్రస్థాయికి ఎంపికైన 'నాకు నచ్చిన కవిత'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని కళాసంగీత నాట్యవేదికలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయిలో బుధవారం నిర్వహించిన కవి సమ్మేళనంలో కవి చింతకుంట్ల కుమార్ వినిపించిన నాకు నచ్చిన కవిత ఎంపికైంది. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయుడు కవి కుమార్ కవిత రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు, టీఎన్జీవో పూర్వఅధ్యక్షుడు దేవిప్రసాద్‌లు శాలువా కప్పి, మెమొంటోతో ఘనంగా సన్మానించారు. కవి కుమార్ కవిత రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల మానుకోట పట్టణ కేంద్రానికి చెందిన కవులు, రచయితలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● మానుకోట రూరల్ సీఐ సర్వయ్య



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ సర్వయ్య

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ సర్వయ్య అన్నారు. మహబూబాబాద్ మోడల్ స్కూల్‌లో గురువారం జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ ఆదేశాల మేరకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సెల్ ఫోన్‌లకు అపరిచితుల నుంచి మెసేజ్‌లు వస్తే వాటి లింకును ఓపెన్ చేయవద్దన్నారు. విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా, మెసేజ్‌లు చేసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పార్ట్‌టైం జాబ్ మోసాలు, ఇతర ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు. ఎస్సై దీపికరెడ్డి, బ్లూకోర్ట్ సిబ్బంది ఈర్య, రాందాస్, ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రావణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీజీ కళాశాల ఎదుట సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. పెండింగ్‌లో ఉన్న 8500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



ఇందిరమ్మ ఇల్లును పరిశీలిస్తున్న సుష్మిత

నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

● ఎంపీడీవో సుష్మిత

మహబూబాబాద్ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో సుష్మిత అన్నారు. మహబూబాబాద్ మండలం సండ్రలగూడెం గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ...గ్రామంలో 50 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా 30 బేస్‌మెట్ లేవల్, 10 స్లాబ్ లెవల్, 10 ఇండ్ల నిర్మాణం పూర్తి చేసినట్లు చెప్పారు. త్వరలోనే మిగిలిన ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

డీఎస్వో ప్రేమ్‌కుమార్ బదిలీ

మహబూబాబాద్ అగ్రికల్చర్, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి (డీఎస్వో) ప్రేమ్‌కుమార్ గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మానుకోటలో పని చేస్తున్న ఏఎస్వో జాటోతు రమేష్‌కు ఇన్‌చార్జి డీఎస్వోగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

మేడారంలో ఆర్టీసీ పనులు ప్రారంభం

తాడ్వాయి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో2026 జనవరి 28 నుంచి 31 వరకు మహా జాతరకు జరగనున్న నేపథ్యంలో భక్తుల కోసం ఆర్టీసీ ప్రాంగణ పనులు చేపడుతున్నారు. ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.సోలొమాన్, వరంగల్ జోన్ ఆర్ఎం డి.విజయ గురువారం భూమి పూజ చేశారు. అనంతరం ప్రాంగణం చదును పనులను ప్రారంభించారు. 2026 మహా జాతరకు 4 వేల బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. భక్తులకు ప్రయాణ సౌకర్యాల్లో భాగంగా పనులను చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పనులకు భూమి పూజ చేస్తున్న టీఎస్ ఆర్టీసీ అధికారులు

సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

● ఎస్సై రమేష్‌బాబు

నెల్లికుదురు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో గురువారం సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు పార్ట్‌టైం జాబులు ఇప్పిస్తామని మెస్సేజ్‌లు పెట్టి మోసం చేయడం జరుగుతుందన్నారు. గుర్తుతెలియని వ్యక్తులకు మొబైల్ ద్వారా డబ్బులు పంపవద్దన్నారు. నకిలీ ప్లాట్‌ఫాం మోసాలు, నకిలీ ఐపీవోల ద్వారా మోసాలు జరుగుతున్నాయని జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు గొడుగుల పంపిణీ

కురవి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కురవి వీరభద్రస్వామి సమీపంలో వీధి వ్యాపారులకు గురువారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జంబో గొడుగులు పంపిణీ చేశారు. రోటరీ మహబుబాబాద్ అధ్యక్షుడు వేమిశెట్టి కిషోర్, కార్యదర్శి జంగాల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగి ఈ కార్యక్రమంలో కురవి దేవాలయ చైర్మన్ కోర్ని రవీందర్‌రెడ్డి మాట్లాడారు. రోటరీ క్లబ్ ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు చేపడుతుందన్నారు. రోటరీ వ్యవస్థాకుడు మాలె నాగేశ్వర్‌రావు, వద్దుల సురేందర్‌రెడ్డి, బిక్షి, వెంకటేశ్వర్లు, సాధు మహిపాల్‌రెడ్డి, బోనగిరి గిరిధర్‌గుప్తా, జంగాల నర్సింహారావు పాల్గొన్నారు.